క్లుప్తంగా

నీటి సమస్యకు పరిష్కారం



28వ వార్డులో బోరు తవ్వకాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: ప్రజల దాహం తీర్చేందుకే బోరుబావి వేసినట్లు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 28వ వార్డులో బోరుబావి వేయించడంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, రాష్ట్ర శాప్ మాజీ చైర్మన్, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి చైర్మన్, కౌన్సిలరు రాధిక, వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మంచి మనస్సుతో ప్రజల దాహం తీర్చడానికి బోరు బావి వేయించడం హర్షించదగ్గ విషయమన్నారు. పట్టణంలోని ప్రతి ఇంటికి నీరు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణ, రాజశేఖరప్ప, తదితరులు పాల్గొన్నారు.

గుండ్లకమ్మ వాగు పరిశీలన

ఆత్మకూరు: పట్టణంలోని గుండ్లకమ్మ వాగును మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుండ్లకమ్మ వాగు పొంగిపొర్లడం వలన కొన్ని కాలనీల్లో నీరు ఇళ్లలోకి వచ్చినట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు. ఇందులో భాగంగా గుండ్లకమ్మ వాగును పరిశీలించిటన్లు తెలిపారు. వాగు విస్తీర్ణం తగ్గడం వలన వర్షపు నీరు అధికమై ఇళ్ల ముందుకు , రహదారుల వెంట ప్రవహిస్తోందని చెప్పారు. త్వరలోనే గుండ్లకమ్మ వాగు పూడిక తీసి వర్షపు నీరు నిల్వ ఉండకుండా తరలిస్తామని చెప్పారు.

కరువు మండలంగా ప్రకటించాలి

కొత్తపల్లి: మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను అన్ని విధాల ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రాజశేఖర్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ స్వాములు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏపీ రైతు సంఘం మండల కమిటీ సమావేశం సరస్వతి స్కూల్ ఆవరణలో నిర్వహించారు. రైతుల, కౌలు రైతుల సమస్యలపై ఈనెల 25న మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాలో రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బి రామేశ్వరరావు, ఎస్ సంజీవరాయుడు, జి దాసు, పి ఏసన్న తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఈ- కేవైసీ చేయించుకోండి

కొత్తపల్లి: ఈనెల చివరిలోగా రైతులందరూ ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఓ కె.మహేష్ సూచించారు. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో సుమారు 8వేల హెక్టార్లలో వివిధ రకాల పంటలను సాగుచేసుకుంటున్నారన్నారు. మొత్తం 8 వేల మంది రైతులున్నారని, అందులో 5400 మంది రైతులు పంట నమోదు చేసుకున్నారని తెలిపారు. వీరిలో 4 వేల మంది ఈ-కేవైసీ చేయించుకున్నారని, మిగతా వారు కూడా పంట నమోదు, ఈ- కేవైసీ త్వరగా చేయించుకోవాలని సూచించారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయ బృందం

కొత్తపల్లి: క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనపరిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని హెచ్ఎం సుబ్బారెడ్డి, ఎస్‌జీఎఫ్ మండల కో-ఆర్డినేటర్ మురళీనాయక్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీల్లో జెడ్పీహెచ్ఎస్ నుంచి 35 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఇందులో వివిధ క్రీడలనుంచి 12 మంది క్రీడాకారులు జిల్లాస్థాయికి ఎంపిక య్యారన్నారు. ఇందులో బాలురు కబడ్డీలో ఇద్దరు, వాలీబాల్‌లో ముగ్గురు, బాలికలు కబడ్డీలో ఇద్దరు, బాలురు అథ్లెటిక్స్‌లో ఐదుగురు ఎంపికయ్యారని చెప్పారు.

కేసు నమోదు

మిడుతూరు : మండల పరిధిలోని రోళ్లపాడు, తలముడిపి గ్రామాల మధ్య జరిగిన కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు దేవనూరు గ్రామానికి చెందిన చిన్నపుల్లన్న అనే వ్యక్తి తలముడిపి జెడ్పీ హైస్కూల్‌లో విధులు నిర్వహించేందుకు స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంపై వెళుతుండగా టీఎస్ 08 ఈజే 6378 అనే నంబర్ గల కారు రాంగ్‌రూట్‌లో వేగంగా వచ్చి ఢీకొనడంతో అతడు తీవ్రగాయాలపాలైనట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

పేదల ఆరోగ్యానికి 'సురక్ష'

- ఈ నెల 30 నుంచి అక్టోబర్ 30 వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు
- 14 రకాల వైద్యసేవలతో పాటు ఇతర రోగాలకు ఉచిత వైద్య పరీక్షలు
- ఇప్పటికే ఆశావర్కర్లు, వలంటీర్లుతో ఇంటింటి సర్వే
- నియోజకవర్గంలో దాదాపు 2 లక్షల మందికి అందనున్న వైద్య సేవలు



ఆత్మకూరులో ఓ ఇంటి వద్ద సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూరు: మారుమూల పల్లెల్లో సైతం మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే పల్లెల్లో వలంటీర్లు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి సర్వే కొనసాగిస్తున్నారు. ఇళ్లల్లో కుటుంబసభ్యులకు ఏఏ వ్యాధులున్నాయి. ఏ మందులివ్వాలి, వారికి ఎలాంటి వైద్య సేవలు అందించాలనే వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో పొందపరుస్తున్నారు. చికిత్స అవసరమైన వారికి టోకెన్లు జారీ చేస్తున్నారు.

14 రకాల వైద్య పరీక్షలు ..

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 30 నుంచి అక్టోబర్ చివరి వరకు నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య సిబ్బంది 14 రకాల వైద్య పరీక్షలతో పాటు ఇతర జబ్బులను సైతం గుర్తించి కార్పొరేట్ వైద్య సేవలు అందించేందుకు కూడా సిద్ధమవుతున్నారు. ఇందులో బీపీ, షుగర్, మలేరియా, హిమోగ్లోబిన్, డెంగీ, యూరియా, గళ్ల పరీక్షలతో పాటు ఇతర రోగాలను గుర్తించి వారికి ఉచితంగా ప్రభుత్వమే కార్పొరేట్ స్థాయి వైద్యం అందించనుంది. ఈ మేరకు ఇప్పటికే సర్వేద్వారా రోగుల వివరాలను సేకరిస్తున్నారు.

గ్రామాలు, సచివాలయాల్లో వైద్య శిబిరాలు

శ్రీశైలం నియోజకవర్గంలోని అన్ని పల్లెలు, పట్టణాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద అన్ని సచివాలయాలు, గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో సర్వేలో పొందుపడిచిన కుటుంబసభ్యుల వివరాలతో పాటు వారికి ప్రతి ఇంటి వద్ద వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించనున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహిస్తారు.

ఈ నెల 30 నుంచి శిబిరాలు

ఆత్మకూరు, శ్రీశైలం మండలాల్లో ఇప్పటికే అధికారులు రెండు టీమ్‌లను ఏర్పాటు చేసి ఈ ప్రత్యేక వైద్యశిబిరాల వివరాలు వెల్లడించారు. ఈ నెల 30న వెంకటాపురం జిల్లా పరిషత్ హైస్కూల్, అక్టోబర్ 7న నల్లకాల్వ సచివాలయం, 10న కృష్ణాపురం సచివాలయం, 12న వడ్లరామాపురం జిల్లా పరిషత్‌హైస్కూల్, 16న బాపనంతపురం సచివాలయం, 19న ముష్టపల్లి, 26న కరివేన, 28న సిద్ధాపురం సచివాలయం, 3న కురుకుంద జిల్లా పరిషత్‌హైస్కూల్, 9న శ్రీపతిరావుపేట హైస్కూల్, 18న కొట్టాలచెర్వు హైస్కూల్, 6న సున్నిపెంట - 1వ సచివాలయం, 13న సున్నిపెంట- 2 , 20న సున్నిపెంట- 3, 27 న సున్నిపెంట 4 సచివాలయాలతో పాటు వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుంది.

దాదాపు 2 లక్షల మందికి వైద్య సేవలు

శ్రీశైలం నియోజకవర్గంలో దాదాపు 2 లక్షల మందికి పైగా ప్రజలకు వైఎస్సార్ ఆరోగ్య సురక్ష ద్వారా ఉచిత వైద్యసేవలు అందనున్నాయి. ఈ మేరకు టోకెన్లు జారీ చేశారు. శ్రీశైలం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో, గ్రామాల్లో ఎంపీడీఓ ,తహసీల్దార్, వైద్యాధికారులుతో పాటు నలుగురు ప్రత్యేక డాక్టర్లు, ఇద్దరు స్పెషలిస్టు డాక్టర్లు వైద్యశిబిరాల్లో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారు. ఒక వేళ ఎవరైనా టోకెన్ పొంది ఆయా తేదీల్లో శిబిరానికి హాజరు కాలేకపోతే గుర్తించి వారికి మరో రోజు వైద్య పరీక్షలు ఏర్పాటు చేయనున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే గ్రామాల్లో శిబిరాల తేదీలను గ్రామాల వారీగా వివరించాం. ఆత్మకూరు పట్టణంలో ఆయా సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశాం. ఇప్పటికే వైద్యాధికారులు, ఆశావర్కర్లు, వలంటీర్లు, అధికారులు సమావేశమై ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని చేపడుతున్నాం. శిబిరాల ఏర్పాటుకు అవసరమైన సామగ్రి సిద్ధంగా ఉంచాం. - మోహన్‌కుమార్, ఎంపీడీఓ , ఆత్మకూరు

ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహిస్తాం



ఈ నెల 30 నుంచి అక్టోబర్ చివరి వరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించేందుకు వైద్య సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. ఇంట్లోని ప్రతి కుటుంబసభ్యునికి వైద్య పరీక్షలు నిర్వహిస్తాం. ఎవరెవరికి ఏఏ రోగాలు ఉన్నాయో తెలుసుకొని వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులు అందజేస్తాం. ఇతర రోగాలు ఉంటే ప్రత్యేక వైద్యాధికారుల ద్వారా రోగాలు గుర్తించి వైద్యపరీక్షలు అందిస్తాం. - గోపాల్, వైద్యాధికారి, బైర్లూటి, ఆత్మకూరు

గొప్ప విషయం



గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఈ నెల 30 నుంచి అక్టోబర్ చివరి వరకు నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఇళ్లలో ఉన్న ప్రతి ఒక్కరికి ఏఏ వ్యాధులు ఉన్నాయో స్పష్టమవుతుంది. చాలా మంది జ్వరము, లేదా ఇతర రోగాలు సోకినప్పుడే వైద్యశాలకు వెళ్తుంటారు. మిగతా సమయంలో ఆరోగ్యం గురించి పట్టించుకోరు. ఇలాంటి వారికి వైద్య శిబిరాల్లో 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించడం గొప్ప విషయం. - శివరాం, కొత్తరామాపురం

ఓంకారేశ్వరుడి హుండీ ఆదాయం 3.21లక్షలు



ఓంకారంలో హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఓంకారంలో నిర్వహించిన హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ. 3.21లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. ఓంకారం పుణ్యక్షేత్రంలో శనివారం హుండీ కానుకల లెక్కింపు చేపట్టారు. ఏడు నెలలకు సంబంధించి రూ. 3,21,063 ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ విశ్వనాథరెడ్డి, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, తిరుమల బాలాజీ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు

853.50 అడుగులుగా శ్రీశైలం డ్యామ్ నీటిమట్టం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యామ్ నీటిమట్టం శనివారం సాయంత్రానికి 853.50 అడుగులకు చేరుకుంది. జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు 8,599 క్యూసెక్కుల నీటిని శుక్రవారం నుంచి శనివారం వరకు విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 2,063 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 1,887 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో స్వల్పంగా 1.158 మిలియన్ యునిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి, దిగువ నాగార్జున సాగర్‌కు 2,187 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. ప్రస్తుతం జలాశయంలో 87.8605 టీఎమ్‌సీల నీరు నిల్వగా ఉంది. .

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం



నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులు

శ్రీశైలం: క్షేత్రవ్యాప్తంగా ఈ నెల 18న వినాయకచవితిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన గణనాథులను శనివారం పురవీధుల్లో ఊరేగింపుగా ఆయా కమిటీల వారు భారీ బందోబస్తు మధ్య నిమజ్జనానికి తరలించారు. క్షేత్రంలో 39 ప్రదేశాలలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయగా శాస్త్రోక్త పూజల అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లారు. సాక్షిగణపతి వద్ద దేవస్థానం ఏర్పాటు చేసిన మృత్తికా గణపతి, దేవస్థానం న్యూస్టాఫ్ క్వాటర్స్ మల్లికార్జున కల్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన గణపతి, వర్క్‌షాప్ వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాలు తొమ్మిది రోజుల పాటు నిత్యపూజలందుకోనున్నాయి.

రూ. 1,15,116లకు లడ్డూ వేలం

క్షేత్రంలోని శ్రీగిరి కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుని చేతిలో ఉంచిన లడ్డూకు పోటాపోటీగా వేలం పాట జరగగా దాసరి శివకుమార్ రూ.1,15,116లకు పాడి దక్కించుకున్నారు. ఈ లడ్డూప్రసాదాన్ని శ్రీగిరికాలనీ వాసులకి, వారి బంధుమిత్రులకు, ఇతర కాలనీవాసులకు ప్రసాదంగా పంపిణీ చేస్తున్నట్లు ప్రకటించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి



యూనిట్‌ను ప్రారంభిస్తున్న పీడీఓ శ్రీధర్‌రెడ్డి

మహానంది: మహిళలకు ఆర్థికాభివృద్ధితో పాటు నలుగురికి జీవనోపాధి కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మహానంది, అల్లీనగరం గ్రామాల్లో శనివారం పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ ప్రోగ్రామ్స్‌లో భాగంగా షామియానాల సప్లయర్ షాపు, పిండిమిషన్, చకోడీలు తయారు చేసే యూనిట్లను ప్రారంభించారు. పీడీ మాట్లాడుతూ రూ. 4.16లక్షలతో షామియానాల సరఫరా యూనిట్, రూ. 1.95లక్షలతో చకోడీలు చేసే యూనిట్, రూ. 1.50లక్షలతో పిండిమిషన్ యూనిట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడంతో పాటు గ్రామాల్లో పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి చేర్చడమే వైఎస్సార్ క్రాంతి పథకం ఉద్దేశమన్నారు. జగనన్న తోడు, స్త్రీనిధి పథకాల్లో భాగంగా నెలరోజుల్లో లక్ష్యాలు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. వైకేపీ ఏపీఎంలు శ్రీనివాసులు, బాబురావు, ఎల్లయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు మైమున్నీసా, అంగన్‌వాడీ టీచర్ ఫాతిమా మేరీరాణి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

మిడుతూరు : మండల పరిధిలోని కడుమూరు గ్రామ సచివాలయాన్ని మండల విస్తరణాధికారి పక్రుద్దీన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ సిబ్బంది క్రమం తప్పకుండా తమ విధులకు సమయానికి హాజరు కావాలని సూచించారు. గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.

ఆరోగ్య మేళాలను సద్వినియోగం చేసుకోండి

వెలుగోడు: ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా వారానికి ఒకసారి నిర్వహిస్తున్న ఆయుష్మాన్ ఆరోగ్య మేళాను సద్వినియోగం చేసుకోవాలని సీహెచ్‌సీ వైద్యాధికారి వి.నాగరాజు సూచించారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆయుష్మాన్ ఆరోగ్య మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం యాంత్రిక జీవన విధానంలో మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్, ఊబకాయం తదితర వ్యాధులు అధికంగా వస్తున్నాయన్నారు. వీటిని అధిగమించేందుకు యోగా, మెడిటేషన్, శారీరక శ్రమను జీవన విధానంలో ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ జయపాల్, వైస్ ఎంపీపీ శంకర్ నాయక్, వైద్య నిపుణులు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి

నందికొట్కూరు రూరల్ : మండలంలోని వైద్యులు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందజేయాలని మండల ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి సూచించారు. శనివారం మండలంలోని బ్రాహ్మణకొట్కూరు పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను అధికారులు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షకు సంబంధించి అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మరియమ్మ, వైద్యుడు సుబ్రమణ్యం, వైఎస్సార్‌సీపీ నాయకులు రాఘవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఊరేగింపులో అపశృతి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు

శ్రీశైలం: శ్రీశైల మహాక్షేత్రంలో శనివారం గణపతి నిమజ్జనోత్సవ కార్యక్రమంలో అపశృతి చోటు చేసుకుంది. రెడ్ల సత్రంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని ట్రాక్టర్ లో ఊరేగింపుగా తీసుకుని వస్తుండగా స్థానిక క్యాంటీన్ వద్ద కేబుల్ వైర్ తగిలి నారాయణ(27) అనే యువకుడు ట్రాక్టర్ నుంచి కింద పడిపోయాడు. అతనిని వెంటనే స్థానిక దేవస్థానం వైద్యశాలకు తరలించారు. ప్రాణభయం లేదని, కానీ అతను పూర్తి మద్యం మత్తులో ఉండడం వలన కింద పడిపోయి ఉండవచ్చని డాక్టర్లు తెలిపారు. చికిత్స అందిస్తున్నామని, కొన్ని గంటల వ్యవధిలో తేరుకునే అవకాశం ఉందన్నారు.

రేసు కుక్కల దాడిలో దూడ మృతి

మహానంది:నల్లమల సమీపంలోని బసవాపురం చెరు వు వద్ద ఆవు దూడలు, బర్రెలను మేపుకుంటుండగా రేసు కుక్కలు దాడి చేయడంతో ఓ దూడ మృతి చెందిన సంఘటన శనివారం చోటు చే సుకుంది. బసవాపురం గ్రామానికి చెందిన ఓ పాడిరైతు తన బర్రెలు, దూడలను మేపుకునేందుకు చెరువు సమీపంలోకి వెళ్లాడు.అయితే మందపై రేసు కుక్కలు దాడి చేయడంతో ఓ దూడ మృతి చెందగా, మరో దూడకు తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు.

26న సర్వసభ్య సమావేశం

మహానంది: బండిఆత్మకూరు మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 26న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వాసుదేవగుప్తా తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ చిన్న సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు. అన్ని శాఖల అధికారులు, గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు హాజరై సమస్యలపై చర్చించాలని కోరారు.

రాష్ట్ర ముస్లిం రచయితల సంఘం ఉపాధ్యక్షుడిగా సమద్

నంద్యాల(వ్యవసాయం): ఆంధ్ర రాష్ట్ర ముస్లిం రచయితల (మురసం) ఉపాధ్యక్షుడిగా నంద్యాల కవి రచయిత షేక్ అబ్దుల్‌సమద్ ఎన్నికయ్యారు. ఆయన మాట్లాడుతూ గుంటూరులో ఇస్లామియా కార్యాలయంలో జరిగిన సమావేశంలో తనును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. మతసామరస్యం సామాజిక సాహిత్య చైతన్యం, తెలుగుభాషాభివృద్ధి వంటి లక్ష్యాలతో మురసం పని చేస్తుందన్నారు.



పాములపాడులో విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

జిల్లా క్రీడలకు ఎంపిక

పాములపాడు: క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని హెచ్ఎం వెంకటసుబ్బమ్మ అన్నారు. ఎస్‌జీఎఫ్ క్రీడల్లో జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులను శనివారం స్థానిక ఏఎస్ఆర్ జెడ్పీహెచ్ స్కూలులో అభినందించారు. ఆమె మాట్లాడుతూ.. తమ పాఠశాల నుంచి అథ్లెటిక్స్‌లో సత్తా చటిన విద్యార్థులు బాలికల విభాగంలో మానిక 100 మీటర్లు, 200 మీటర్లు పరుగు పందెంలో గోల్డ్ మెడల్, కీర్తన 200 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్, బాలుర విభాగంలో శివశంకర్ 200 మీటర్స్ పరుగు పందెంలో సిల్వర్ మెడల్‌ను నియోజకవర్గ స్థాయిలో సాధించి జిల్లా స్థాయికి ఎంపికయ్యారన్నారు. అలాగే కబడ్డీ అండర్-17 విభాగంలో జగన్, అండర్-14లో దిల్‌రాజు, వాలీబాల్ లో కీర్తన, జ్యోతి, రాధిక, కబడ్డీలో శ్యామల, ఖోఖోలో మల్లీశ్వరిలు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. విద్యార్థులకు ప్రతిభకు ప్రోత్సహించిన పీడీ రాజశేఖర్ ను ప్రత్యేకంగా అభినందించారు.



ఎంపికైన బొల్లవరం విద్యార్థులతో ఉపాధ్యాయులు

జిల్లాస్థాయి పోటీలకు బొల్లవరం విద్యార్థులు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని బొల్లవరం ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల హెచ్ఎం లక్ష్మీనరసమ్మ తెలిపారు. అండర్-14 కబడ్డీలో జిల్లా స్థాయికి ఎంపికైన శ్రీవల్లి, శశికళ, నితీషాలను అభినందించారు. కార్యక్రమంలో పీడీ రాఘున్న, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు

నందికొట్కూరు: ఆర్టీసీ గిఫ్ట్ స్కీంలో భాగంగా నందికొట్కూరు నుంచి కర్నూలుకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన ప్రయాణికులకు శనివారం బహుమతులు అందజేశారు. శనివారం ప్రయాణికుల సమక్షంలో గిఫ్ట్ స్కీంలో భాగంగా మూడు బస్సుల టికెట్లను డిప్ తీయగా మొదటి బహుమతి రసూల్, రెండో బహుమతి ఎస్.ఈశ్వరి, మూడోవ బహుమతి అక్కిరెడ్డిలకు దక్కాయి. డిపో మేనేజర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కర్నూలుకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే వారి కోసం గిఫ్ట్ స్కీం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులు టికెట్ వెనుక భాగంలో పేరు, ఊరు పేరు, సెల్ నెంబరు రాసి బస్సులో ఏర్పాటు చేసిన గిఫ్ట్ స్కీం బాక్స్‌లో వేయాలన్నారు. ప్రతి నెల 8, 23వ తేదీల్లో బాక్స్‌లను ఓపెన్ చేసి డిప్ తీసి 1, 2, 3 బహుమతులను అందజేయడం జరుగుతుందని చెప్పారు.

పదోన్నతిపై ఈఓపీఆర్డీ బదిలీ



ఈఓపీఆర్డీ సుబ్రమణ్యశర్మను సన్మానిస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా ఈఓపీఆర్డీ సుబ్రమణ్యశర్మ పదోన్నతిపై కడప జిల్లా చెన్నూరు మండలానికి బదిలీ అయ్యారు. శనివారం ఆయన విధుల్లోంచి రిలీవ్‌కాగా ఆయనను ఇన్‌చార్జి ఎంపీడీఓ నూర్జహాన్, ఎంపీపీ సువర్ణమ్మ, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, పీఆర్ ఏఈ బషీర్, సీనియర్ అసిస్టెంటు మద్దమ్మ, కార్యాలయ సిబ్బంది ఆయనకు శాలువ కప్పి పూలమాలతో సత్కరించి వీడ్కోలు పలికారు. కాగా, సుబ్రమణ్యశర్మ స్థానంలో జూపాడుబంగ్లా పంచాయతీ కార్యదర్శి శాంతయ్యకు ఇన్‌చార్జి ఈఓపీఆర్డీగా బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు దేవసహాయం, కార్యదర్శి సామేలు, శాంతయ్య, జూనియర్ అసిస్టెంటు హర్షిణి పాల్గొన్నారు.

ర్యాగింగ్ అమానవీయమైనది



ప్రసంగిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వి.వెంకటేశ్వరరావు

ఆత్మకూరురూరల్: ర్యాగింగ్ అన్నది అమానవీయమైనదని, విద్యార్థుల లేత హృదయాలను గాయపరుస్తుందని ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి వి. వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ఆయన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో విద్యార్థుల నుద్దేశించి ప్రసంగించారు. ర్యాగింగ్ అమానవీయ మైనందువల్లే చట్ట ప్రకారం అందుకు పాల్పడిన వారు శిక్షార్హులవుతారని హెచ్చరించారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారికి మూడేళ్ల నుంచి ఏడేళ్ల వరకు శిక్ష పడుతుందని తెలిపారు. కళాశాల యాజమాన్యం కూడా యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేసుకుని ర్యాగింగ్ భూతాన్ని తరిమేయాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి తేజ సాయి, న్యాయవాదులు బలరామ్ నాయక్, శ్రీధర్ అడిగే, మాణిక్యరావు , కళాశాల ప్రిన్సిపాల్ వెంకట నర్సమ్మ, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

మహానంది: సచివాలయాల్లో పనిచేసే సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని బండిఆత్మకూరు ఎంపీడీఓ వాసుదేవగుప్త హెచ్చరించారు. బండిఆత్మకూరు మండలంలోని సంత జూటూరు, కడమలకాల్వ గ్రామసచివాలయాల్లో శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సంత జూటూరు కార్యదర్శి చౌడయ్యకు మెమో అందిచడంతో పాటు కడమలకాల్వ పీఎస్, సింగవరం ఏఎన్ఎంలకు హెచ్చరికలు చేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని సచివాలయాల్లో సిబ్బంది క్రమం తప్పకుండా నిర్ణీత వేళలకు హాజరు కావాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

2 నుంచి నగదు రహిత లావాదేవీలు

పగిడ్యాల: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే నెల 2వ తేదీ నుంచి అన్ని గ్రామ సచివాలయాలలో నగదు రహిత లావాదేవీల నిర్వహణ చేపట్టాల్సి ఉందని మండల శిక్షకులు జయకుమార్, మల్లికార్జునలు తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్స్‌కు నగదు రహిత లావాదేవీలపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం చేపట్టారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అవసరమైన సేవలకు చెల్లించే రుసుమును నగదు రూపంలో కాకుండా ఈ పేమేంట్స్ రూపంలో చెల్లించాలని అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శులు ఉపేంద్రారెడ్డి, సమతయశోదర, జావేద్, వీరన్నయాదవ్ తదితరులు ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రమేష్, పీడీ పద్మమ్మ

జూపాడుబంగ్లా: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. శనివారం స్కూల్‌గేమ్స్ క్రీడల్లో తాలూకా స్థాయిలో ప్రతిభచూపి జిల్లా గేమ్స్ కు ఎంపికై న విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ తాలూకా స్థాయి స్కూల్‌గేమ్స్‌లో అండర్-14 విభాగంలోని కబడ్డీలో శివకేశవ్, ప్రభాస్, ఖోఖోలో భార్గవి, అండర్-17 విభాగంలో 400 మీటర్ల అథ్లెటిక్స్‌లో తేజశ్విని, విజయ్ వాలీబాల్, కబడ్డీ క్రీడల్లో ప్రతిభ చూపి జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు తెలిపారు. అలాగే పాఠశాలకు చెందిన జూనియర్ బైపీసీ విద్యార్థిని సానియా రాష్ట్ర స్థాయిలో అండర్-19 విభాగంలో వాలీబాల్ గేమ్స్‌కు ఎంపికై నట్లు వ్యాయామ ఉపాధ్యాయురాలు పద్మమ్మ తెలిపారు.